క్లుప్తంగా

మట్టిలోడు ట్రాక్టర్ల స్వాధీనం



కోడూరు: మట్టి అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లకు రెవెన్యూ అధికారులు జరిమానా విధించారు. బందరు మండలం వాడపాలెంనుంచి కోడూరు వైపు ట్రాక్టర్ల సహాయంతో మట్టి అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ఉల్లిపాలెం వారధి వద్ద అవనిగడ్డ సీఐ యువకుమార్ అక్రమ మట్టి తరలింపును అడ్డుకొని, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించారు.తహసీల్దార్ శ్రీనునాయక్ ఒకొక్క ట్రాక్టర్ యజమానికి రూ.2 వేలు జరిమానా విధించారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం నుంచి చల్లపల్లి వైపు ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌ను పెదప్రోలు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వైవీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎలాంటి రశీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక, బుసక, మట్టి తవ్వకాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ

నాగాయలంక: మండలంలో ఎన్నికైన గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. మండల తహసీల్దార్ ఎం.హరనాథ్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులుగా పంచాయతీల పాలనా ప్రక్రియలో ప్రజావసరాలను గుర్తించి ఆచరించడం అవశ్యమని పేర్కొన్నారు. తొలుత శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ జె.సీతారామ్‌కుమార్ ప్రారంభించారు. ఈవోపీఆర్డీ కలపటపు అప్పల నరసమ్మ, వక్కపట్లవారిపాలెం సర్పంచి అంబటి శ్యామ్‌ప్రసాద్, ఒక్కో పంచాయతీ నుంచి ఉపసర్పంచ్, ఇద్దరేసి వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు డుమ్మా

బంటుమిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైన శిక్షణ తరగతులకు హాజరైన వార్డు సభ్యులు మధ్యాహ్నం నుంచే వెళ్లిపోయారు. పంచాయితీకి ముగ్గురు వార్డు సభ్యులకు, సచివాలయ కార్యదర్శులకు సోమ, మంగళవారాల్లో పాలనాపరమైన నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు మొదటి రోజు శిక్షణలో భాగంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వీడియోతో శిక్షణ తరగతి నిర్వహించారు. వీడియోలో ఉన్న సమాచారాన్ని ఈఓపీఆర్‌డీ శైలజకుమారి అవగాహన కల్పించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతి నిర్వహించాలని ఆదేశాలున్నాయి. వారికి మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు. ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి ఇస్తున్న శిక్షణ కార్యక్రమ ఉద్దేశాన్ని విస్మరించిన వార్డు సభ్యులు ఎవరికివారు భోజనం తర్వాత ఇంటి ముఖం పట్టారు. దీంతో రెండోపూట శిక్షణ తరగతులు సచివాలయ ఉద్యోగులకు మాత్రమే పరిమితమైంది. వారు కూడా ఆవరణలో సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తూ కనిపించారు.

ఉత్తరం ఎంతో విలువైనది

మచిలీపట్నంటౌన్: గతం నుంచి వర్తమానం వరకు ఉత్తరానికి ఎంతో విలువ ఉందని ప్రముఖ రచయిత్రి మేరీ కృపాబాయ్ అన్నారు. తపాలా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రధాన పోస్టాఫీసులో మెయిల్స్ అండ్ పార్శిల్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన మేరీ కృపాబాయ్ మాట్లాడుతూ ఆమె రచించి ఉత్తరం రచనను పోస్ట్‌మెన్లకు వివరించారు. మెయిల్స్, పార్శిల్స్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కస్టమర్ మీట్ నిర్వహించారు. తపాలా సేవలను స్థానిక కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు తపాలా సిబ్బంది వివరించారు. మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె. ఆదినారాయణ పర్యవేక్షించారు.

విద్యుత్ సమస్యలపై సమీక్ష

అవనిగడ్డ: ఇటీవల నాయుడుపేటలో విద్యుత్ సమస్యపై ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేశారని అక్కడవరకూ ఎందుకు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విద్యుత్‌శాఖాధికారులపై మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం విద్యుత్ శాఖాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సమస్య వచ్చినపుడు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉయ్యూరు డీఈఈ డి.కృష్ణనాయక్ మాట్లాడుతూ వరద ముంపు గ్రామాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించినట్టు చెప్పారు. ఇకముందు ఇలాంటి సమస్య రాకుండా చూసుకుంటామన్నారు. అవనిగడ్డ, చల్లపల్లి ఏడీఈలు నడకుదిటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పులి శివనాగేశ్వరరావు, సబ్ ఇంజినీర్లు టి.ప్రసాద్, రాజు, గోపీ పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సుగుణ కుమారి

ఘంటసాల: మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సుగుణ కుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నూతన బాధ్యతలు స్వీకరించిన సుగుణ కుమారికి సహోద్యోగులు సాదర స్వాగతం పలికారు. ఎంపీడీవో డి.సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ, సచివాలయ, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల ఏలుబడి.. పాలనలో ఒత్తిడి

మానసిక వేదనకు గురవుతున్న ఉద్యోగులు

- కీలక శాఖల్లో ప్రధాన పోస్టులు ఖాళీ
- కింది స్థాయి అధికారులే ఇన్‌చార్జిలు
- పూర్తిస్థాయిలో సిబ్బంది వచ్చేనా.. పనిచేస్తున్న వారిపై భారం తగ్గేనా..!



మండల వ్యవసాయశాఖాధికారి కార్యాలయం

పెడన: ప్రస్తుత తరుణంలో ఆఘమేఘాలపై నివేదికలు ఇవ్వాలని, సర్వేలు చేయాలని, సర్వే ఆఫ్ లైన్ అనంతరం ఆన్‌లైన్, ఇలా ఒకదాని వెంట ఒకటి పనులు పురమాయిస్తూ సిబ్బందిని పరుగులు పెట్టిస్తోంది ప్రభుత్వం. ఈ విధంగా పనులు చేయాలంటే పూర్తిస్థాయి సిబ్బంది ఉండాలి. పెడన నియోజకవర్గంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

ప్రధాన పోస్టులన్నీ..

పెడన నియోజకవర్గంలో ప్రధాన శాఖల్లోని పోస్టులు చాలా ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిని భర్తీ చేస్తారా, లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కారణం పోస్టులు బదిలీ అయిన వెంటనే ఖాళీలు లేకుండా తక్షణం మరొకరితో భర్తీ చేసేవారు. కానీ ఖాళీ అయిన పోస్టుల్లో ఎవరినీ నియమించడం లేదు. మూడు నెలల నుంచి ఖాళీలు ఉన్నా వాటిని కూడా భర్తీ చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- పెడన తహసీల్దారు అబ్దుల్ రహమాన్‌మస్తాన సీఆర్‌డీఏకు బదిలీ కావడంతో నెల రోజులు నుంచి పోస్టు ఖాళీగానే ఉంటుంది. డీటీ కె.అనిల్‌కుమార్‌కు తహసీల్దారుగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆర్‌ఐ మణికుమార్ రిలీవ్ కావడంతో ఈయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఎన్నికల విభాగంలో సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మికి ఆర్‌ఐ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించనున్నారు. కాకర్లమూడి వీఆర్వో వీరబాబు ఉరివి గ్రామానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఎంపీడీవో రెడ్డయ్య బదిలీ కావడంతో ఈవోపీఆర్డీ జయరామ్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలను అప్పగించారు. కొంకేపూడి, కమలాపురం, చెన్నూరు, ఉరవి సచివాలయాలకు పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో ఇన్‌చార్జిలను నియమించాల్సి ఉంది.
- వ్యవసాయశాఖ పెడన ఏవోగా మచిలీపట్నం అగ్రి ల్యాబ్‌లో విధులు నిర్వహించే నూరున్నీసాకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. మూడు నెలలు అవుతోంది. కార్యాలయానికి ఎప్పుడు వస్తున్నారో..ఎప్పుడు వెళ్తున్నారో కూడా ఎవరికీ తెలియని పరిస్థితి. రైతులు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లినా పరిస్థితిలో మార్పు లేదు. మండలంలోని వీఏఏలు 18 మందికి పది మంది ఉన్నారు. మిగిలిన ఎనిమిది మందికి గాను ఒక ఎంపీఈవో, ఇద్దరు ఏఈవోలు ఉన్నారు. నందిగామ వీఏఏ ప్రసన్నకు కొంకేపూడి వీఏఏ బాధ్యతలను అప్పగించారు. కమలాపురం వీఏఏ పద్మావతికి చెన్నూరు, జింజేరు వీఏఏ మౌనికకు కాకర్లమూడి బాధ్యతలను అప్పగించారు. నందమూరు ఎంపీఈవో కీర్తికి బల్లిపర్రు వీఏఏ బాధ్యతలను అప్పగించారు. ఏఈవో నాని పెడన, మడక వీఏఏ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మరొక ఏఈవో లక్ష్మణ్ లంకలకలువగుంట, శింగరాయపాలెం బాధ్యతలను నిర్వహిస్తూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల భారీ వర్షాలకు ముంపు భారిన పంట పొలాలు నమోదు, నష్టపరిహారం సక్రమంగా అందకపోవడం, ప్రస్తుతం ఈకేవైసీలు చేస్తుండటం తలకుమించి భారం అవుతోందని వాపోతున్నారు.
- పెడన పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ జి.సత్యనారాయణ రోడ్డు ప్రమాదానికి గురై సెలవులో ఉన్నారు. ఈయన స్థానంలో మచిలీపట్నం వీఆర్‌లో ఉన్న లక్ష్మీనరసింహమూర్తిని నియమించారు.

బంటుమిల్లి మండలంలో..

మండలంలో ఇన్‌చార్జులను పరిశీలిస్తే ఎంపీడీవోగా పీఆర్ ఏఈ నగేష్ ఇన్‌చార్జిగా ఉన్నారు. తహసీల్దారు కార్యాలయంలో పీడీఎస్ డీటీగా డెప్యూటీ తహసీల్దారు పూర్ణచంద్రరావు ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎన్నికల విభాగంలో ప్రత్యేక అధికారి ఆంజనేయులుకు బంటుమిల్లి ఆర్‌ఐ బాధ్యతలను అప్పగించారు. ఇరిగేషన్ ఏఈగా పెడన ఏఈ నాగేశ్వరరావుకు ఇన్‌చార్జిగా నియమిస్తూ ఆదేశించారు.

గూడూరు మండలంలో..

ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ ఈ రాజేశ్వరి ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆర్‌ఐ పోస్టు ఖాళీగానే ఉంది. ఈ పోస్టులో ఇంకా ఎవరినీ నియమించలేదు.

కృత్తివెన్ను మండలంలో..

మండలంలో ఎంపీడీవో రాంబాబు ఉద్యోగ విరమణ చేయడంతో పోస్టు ఖాళీ ఏర్పడింది. ఈ పోస్టులో కార్యాలయం ఏవో మధుసూదనరావు ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగుతున్నారు.

- ఈ విధంగా ఒక్కొక్కరు రెండేసి బాధ్యతలను నిర్వహిస్తూ తలకుమించిన భారంతో విధులు నిర్వహిస్తున్నారు. ఏమైనా అనుకోకుండా పొరబాట్లు జరిగితే అందుకు అధికారులను బాధ్యులను చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

ఉన్నతాధికారులు స్పందించాలని వినతి

త్వరిగతిన ఆయా పోస్టుల్లో రెగ్యులర్ అధికారులను నియమించాలని కోరుతున్నారు. అయితే ఎవరూ బయటపడటం లేదు. కష్టమైనా భరిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు సత్వర సేవలను అందాలన్నా ఖాళీలు భర్తీ చేయాల్సి ఉందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

రూ.20 లక్షల నిధులతో మౌలిక వసతులు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

కోడూరు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వెల్లడించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని 13 పంచాయతీల పరిధిలో తాగునీటి పైపులైన్లు, బోర్లు ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణాలకు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.20 లక్షల నిధులు కేటాయించినట్లు ఎంపీడీఓ సుధాప్రవీణ్ చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ గ్రామసభల ద్వారా ఆమోదం పొందిన పనులను కూడా ఈ నెల 14 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కోడూరు పీహెచ్‌సీలో పర్మినెంట్ వైద్యాధికారి లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు దృష్టి పెట్టి, ఇద్దరు వైద్యాధికారులను నియమించాలని జెడ్పీటీసీ కోరారు. కోడూరు ఎమ్మార్సీ కార్యాలయ భవనం మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఎంఈఓ-2 శ్రీనివాసరావు కోరారు. జెడ్పీ పాఠశాలల క్రీడాప్రాంగణాలను అభివృద్ధి చేసేందుకు ఎన్ఆర్ఈజీఎస్ నుంచి నిధులు కేటాయించాలని ఎంఈఓ కోరారు. జనవరి నుంచి హంసలదీవి సాగర తీరంలో తాబేళ్ల సంతానోత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. మత్స్యకారులు టీకు వలలను సముద్రం మధ్యలో వినియోగించాలని, ఒడ్డు వెంట వినియోగించడం వల్ల తాబేళ్ల మృత్యువాత పడుతున్నట్లు చెప్పారు. లింగారెడ్డిపాలెం పశు వైద్యశాలకు వైద్యాధికారి రావడం లేదని, దీంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ దాసరి వెంకటేశ్వరరావు సమావేశంలో తెలిపారు. ఉపాధి హామి పథకం, వెలుగు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమ శాఖపరంగా చేస్తున్న పనులను వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్‌కు కోడూరు ఎస్‌ఐ శిరీష

సాక్షి ఎఫెక్ట్



ఎస్‌ఐ శిరీష

కోడూరు: కూటమి నేతలతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న కోడూరు ఎస్‌ఐ శిరీషను వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 29న ఎస్‌ఐ శిరీష పుట్టినరోజు కావడంతో మండలానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు స్టేషన్ ఆవరణను ఫంక్షన్ హాల్‌గా మార్చేసి, ఎస్‌ఐ మెప్పు పొందేందుకు భారీ ఎత్తున పుట్టిన రోజు వేడుకలు జరిపారు. ఈ వేడుకల్లో ఎస్‌ఐ శిరీష పాల్గొని, వారితో కలిసి స్టేషన్ వద్దే పోలీసు యూనిఫాంలో కేక్‌లు కూడా కట్ చేశారు. కూటమి నేతలు స్టేషన్ వద్ద బాణసంచా కాల్చి నానా హడావుడి సృష్టించారు. కూటమి నేతలంతా ఒకేసారి కాకుండా వర్గాల వారీగా వెళ్లి మరీ వేడుకలు జరిపారు. స్టేషన్‌లో ఎస్‌ఐ శిరీష జన్మదిన వేడుకలపై ఈ నెల 1న 'సాక్షి' దినపత్రికలో 'ఎస్‌ఐనా.. మజాకా..!!' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైయింది. ఈ కథనంపై స్పందించిన జిల్లా ఎస్పీ సమగ్ర విచారణకు ఆదేశించారు. జన్మదిన వేడుకల తతంగంతో పాటు మండలంలో ఎస్‌ఐ వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు విచారణ చేశారు. ఎస్‌ఐ శిరీష మొదటి నుంచి వివాస్పందంగానే వ్యవహరిస్తున్నట్లు విచారణలో తేలడంతో ఆమెను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో మచిలీపట్నం తాలుకా ఎస్‌ఐ చాణుక్యను కోడూరు ఎస్‌ఐగా నియమించారు.

శక్తి స్వరూపిణీ.. నమోస్తుతే!

వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రులు



మహాచండిగా దర్శనమిచ్చిన కోడూరు గంగాభవానీ..



శ్రీఇష్టకామేశ్వరి దేవిగా పెడన పైడమ్మ అమ్మవారు



పెదకళ్లేపల్లిలో శ్రీమహా చండీదేవిగా దుర్గమ్మ తల్లి



శ్రీకాకుళంలో శ్రీమహాచండీ దేవిగా..

కోడూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజైన సోమవారం అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చారు. కోడూరు గంగాభవానీ అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ, కోడూరు కనకదుర్గమ్మ అమ్మవార్లను కూడా మహాచండిగా అలంకరించారు. లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీదేవి, కోడూరు దానాశక్తి, పార్వతి, మాచవరం తుంగపల్లెమ్మ, మందపాకల నాంచారమ్మ, హంసలదీవి అన్నపూర్ణమ్మ అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేశారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లిలో శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానం, కొక్కిలిగడ్డలో శ్రీ లలితా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయం, ఉత్తరచిరువోలులంకలో శ్రీ గురవమ్మ అమ్మవార్ల ఆలయం, మోపిదేవి బస్టాండ్ వద్ద చలువ పందిళ్ల కింద ఏర్పాటు దుర్గమ్మ తల్లిని మహాచండీదేవిగా అలంకరించారు. ఉత్తరచిరువోలులంక గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు, నడకుదుటి సీతారామరాజు, నడకుదుటి రాము, రవికుమార్ పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగాయలంక: కృష్ణాతీరంలోని శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు సోమవారం శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వర స్వామి దేవస్థానంలో పార్వతీదేవిని శ్రీమహా చండీదేవిగా, శ్రీవాసవీ కన్యాకా పరమేశ్వరిని శ్రీఅన్నపూర్ణదేవిగా అలంకరించారు. తలశిలవారి ఇలవేలుపు గంగానమ్మతల్లి మహాచండి రూపంలో కొలువుతీరింది. మండల పరిధిలోని గణపేశ్వరం దుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాలలో దుర్గమ్మ మూలవిరాట్ లలితాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

గూడూరు: స్థానిక శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ ఇష్టకామేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తరకటూరులోని శ్రీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో పూజలు అందుకున్నారు. గూడూరులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి రూపంలో దర్శమిచ్చారు.

మచిలీపట్నంటౌన్: ఈడేపల్లిలోని శక్తిగుడిలో శక్తి అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆజాద్‌రోడ్డులోని గీతామందిరంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీగాయత్రి దేవిగా, శ్రీ లలితా అమ్మవారు శ్రీ అష్టలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బుట్టాయిపేట దత్తాశ్రమంలో వారాహి అమ్మవారికి పూజలు చేశారు. నగరంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఖొజ్జిల్లిపేట, చింతగుంటపాలెంలోని నాగేశ్వరస్వామి ఆలయాల్లోని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. గాంధీ బొమ్మ, బచ్చుపేట, గొడుగుపేట, బందరుకోట ప్రాంతాల్లోని శివాలయాల్లో, సర్కిల్‌పేటలోని ముత్యాలమ్మ అమ్మవారు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

బంటుమిల్లి: స్థానిక శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, శ్రీ పోశ్నాపురం గ్రామంలోని శ్రీసువర్చలాంజనేయస్వామి, ఆలయంలో అమ్మవార్లను శ్రీ చండీదేవీగా, పెదతుమ్మిడి శివాలయం లక్ష్మీనారాయణపురం గ్రామంలో అమ్మవార్లను శ్రీ మహాలక్ష్మీదేవీగా అలంకరించారు. బంటుమిల్లి రామాలయంలో శ్రీ సంతానలక్ష్మీదేవీగా, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శ్రీ గజలక్ష్మీ దేవీగా తీర్చిదిద్దారు. మల్లంపూడి, నాగేశ్వరరావుపేట, మల్లేశ్వరం, పెందుర్రు, ముంజులూరు తదితర గ్రామాల్లోని స్థానిక మందిరాల్లో అమ్మవారి ప్రతిమలకు కుంకుమ పూజలు చేశారు.

అవనిగడ్డ: స్థానిక రాజశేఖరస్వామి ఆలయం, లంకమ్మ అమ్మవారి ఆలయం, పులిగడ్డ, వేకనూరు కనకదుర్గ అమ్మవారి ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో గంగాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పెడన: స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీవాసవి మాత శ్రీబాలాత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలో గ్రామదేవత పైడమ్మ అమ్మవారిని శ్రీఇష్టకామేశ్వరిదేవిగా అలంకరించారు. శ్రీశ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో తీర్థపు బిందె ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని దావోజిపాలెం అమలేశ్వరి దేవాలయంలో అమ్మవారిని మహాచండి అవతారంలో దర్శనమిచ్చారు.



గూడూరు మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో..



అడ్డపర్రలో లలితాత్రిపుర సుందరీదేవిగా..



నాగేశ్వరరావుపేట రామాలయంలో శ్రీ దుర్గాదేవిగా



అవనిగడ్డ లంకమ్మ అమ్మవారి ఆలయంలో..



నాగాయలంకలో మహాచండీగా శ్రీపార్వతీదేవి



శ్రీరామపాదక్షేత్రంలో శ్రీమహాచండీగా కనకదుర్గమ్మ

ఐదో రోజుకు చేరిన తాళం భజన పోటీలు

చిట్టూర్పు(ఘంటసాల): మండలంలోని చిట్టూర్పు గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయి తాళం భజన, మురళీ కోలాటం పోటీలు ఐదో రోజు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా చోరగుడికి చెందిన శ్రీ దేవీకామాక్షి రాజ్యలక్ష్మీ భక్త సమాజం, వేములమడకు చెందిన శ్రీ వేణు గోపాల భక్త సమాజం, చినకళ్లేపల్లికి చెందిన శ్రీ లక్ష్మీ గణపతి భక్త సమాజం, చటారిపాలెంకు చెందిన శ్రీ విఘ్నేశ్వర భక్త సమాజం పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. చోరగుడికి చెందిన భక్త సమాజం వారు ఆలపించిన గీతాలు భక్తులను తన్మయత్వం చెందేలా చేశాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పడుగు ప్రభాకర్, ఏసుపాదం వ్యవహరించారు. భజన బృందాలకు ప్రశంసా పత్రం, మెమెంటో కమిటీ సభ్యులతో కలిసి చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు అందించారు. కమిటీ సభ్యులు గుత్తికొండ వర ప్రసాద్, దాసరి సురేష్, వేములపల్లి వెంకట్రావు (సుధీర్), దాసరి సతీష్, మల్లుపెద్ది ప్రవీణ్, యలవర్తి వంశీ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు

చల్లపల్లి(అవనిగడ్డ): దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాకినాడ బీఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ భారతలక్ష్మి కోరారు. విజయవాడకు చెందిన ఎం.ఎ.ఖాదర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చల్లపల్లి ముస్లిం షాదీఖానాలో 15 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భారతలక్ష్మి మాట్లాడుతూ చల్లపల్లికి చెందిన ముజీనాబాను తన తండ్రి పేరుమీద ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎందరో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారని కొనియాడారు. ట్రస్ట్ సభ్యులు జహీరుద్దీన్, మసీద్ కమిటీ అధ్యక్షుడు నసీంఘోరి, ఉపాధ్యాయులు కస్తూరి సుభాషిణి, ఎండీ అస్లాంబాషా, మెహమ్మద్ ఖాజా తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫణికుమార్‌కు సేవారత్న అవార్డు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ సభ్యుడు నీలపాల ఫణికుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆదివారం తిరుపతిలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 8వ సౌత్ ఇండియన్ కాన్ఫరెన్స్‌లో ఆయనకు నిర్వాహకులు సేవారత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. ఫణికుమార్ చేసిన పలు సేవా కార్యక్రమాలు గుర్తించి తమ సంస్థ ద్వారా ఈ అవార్డును అందించామని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఫణికుమార్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఫణికుమార్‌ను మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు కేసాని వేణకుమార్, ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డ పీహెచ్‌సీకి వాటర్ డిస్పెన్సర్‌ను నాదెళ్ళవారిపాలెంకు చెందిన దాత కాకర్ల ప్రమీలారాణి బహూకరించారు. సోమవారం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో తన భర్త కాకర్ల రాధాకృష్ణ జ్ఞాపకార్థం రూ.11 వేల విలువైన వాటర్ డిస్పెన్సర్‌ను ఆమె అందించారు. పీహెచ్‌సీ స్థల దాత రిటైర్డ్ ఆర్డీవో నాదెళ్ళ శివరామకృష్ణ ఈ వాటర్ డిస్పెన్సర్‌ను ప్రారంభించారు. డాక్టర్ కేవీ పద్మావతి, పురిటిగడ్డ మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా



బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ధాన్యం లారీ అదుపు తప్పి తిరగబడింది. బంటుమిల్లి నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లడానికి ముందు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి సెంటర్ డివైడర్‌ను నిర్మించారు. డ్రైవరు గమనించక పోవడంతో లారీ అదుపుతప్పి బోర్డును ఢీకొని డివైడర్ పైకి ఎక్కి పల్టీ కొట్టింది. ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గణేష్‌కుమార్ తెలిపారు.

నకిలీ పురుగు మందులపై విచారణ

సాక్షి ఎఫెక్ట్



దెబ్బతిన్న వరికంకులను వ్యవసాయాధికారులకు చూపుతున్న రైతులు

పెడన: 'నట్టేట ముంచిన నకిలీ' శీర్షికన ఈ నెల 6న నకిలీ దోమల నివారణ మందు విషయమై కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీనిపై స్పందించిన వ్యవసాయశాఖాధికారులు విచారణ నిర్వహించారు. జింజేరు గ్రామంలో జిల్లా వ్యవసాయశాఖ కార్యాయలంలో టెక్నికల్ ఏవో సి.శాంత, పెడన ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా పంట పొలాలను పరిశీలించారు. రైతుల నుంచి వివరాలను సేకరించారు. నకిలీ పురుగు మందు అమ్మినవారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు వ్యాపారి మామిడి లక్ష్మీనారాయణ వద్ద కొనుగోలు చేశామని, రశీదులు ఇవ్వకుండా రైతులకు పురుగు మందులు ఇస్తుండటంతో మేము కూడా తీసుకుని మందు పిచికారీ చేశామని ఎంపీ గోవర్ధన్, మరి కొందరు రైతులు వివరించారు. పురుగుమందు పిచికారీ చేసినా పనిచేయకపోవడంతో పంట గుల్ల అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఏవో నూరున్నీసా మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. విషయాన్ని డీఏవో పద్మావతికి తెలియజేశామని, రెండు, మూడు రోజుల్లో సైంటిస్టులు వస్తారని తెలిపారు.

ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు ఫిర్యాదు

ఈ విషయంపై జింజేరు గ్రామానికి చెందిన రైతులు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఎవరికి చెబుతావో చెప్పుకోండి నాకేంటి భయం అంటూ ఎదురుతిరుగుతున్నాడని, కనీసం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నా భయపెడుతున్నారంటూ ఎమ్మెల్యేకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ పెడన ఎస్‌ఐ సత్యనారాయణకు, వ్యవసాయశాఖాధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎమ్మెల్యేకు సమస్యల ఏకరవు



పెడన: ప్రజాదర్బార్‌లో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు సమస్యలను వినతుల రూపంలో ఏకరవు పెట్టారు. సోమవారం పెడన టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. చెన్నూరు ప్రధాన రహదారి కమలాపురం వద్ద కుంగిపోయిందని, బాగు చేయించాలని పలువురు ఎమ్మెల్యేకు వివరించారు. చెన్నూరులో శ్రీగంగా పార్వతీ నారద లింగేశ్వర స్వామి ఆలయ అర్చకులు ధూప దీప నైవేద్యాలకు నిధులు లేక ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. జెడ్పీ హైస్కూల్‌కు రోడ్డు నిర్మాణం, శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు నిర్మాణం, దహన వాటికను ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని కోరారు. శెలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దారు కె. అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు ఉన్నారు.

లే అవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

పట్టణ పరిధిలోని పైడమ్మ లేఅవుట్‌తో పాటు పల్లోటి-1, 2లలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. ఆయా లే అవుట్‌లను సందర్శించారు. అక్కడివారి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మున్సిపల్, హౌసింగ్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.